క్లుప్తంగా

మోపాల్‌లో పిల్లలకు ఉచిత వైద్యశిబిరం



మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండల కేంద్రంలో నిరూప్ పిల్లల ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత పిల్లల వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నిరూప్‌రెడ్డి 86 మంది పిల్లలను పరీక్షించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ప్రతి నెలా గ్రామీణ ప్రాంతాల్లో ఉచితంగా వైద్య శిబిరం నిర్వహిస్తామని డాక్టర్ నిరూప్ రెడ్డి తెలిపారు. అంతకు ముందు వైద్యశిబిరాన్ని సర్పంచ్ క్యాతం రవి ప్రారంభించారు. ఆర్‌ఎంపీ సుదర్శన్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ, బీఆర్‌ఎస్‌లకు గుణపాఠం తప్పదు



ఖలీల్‌వాడి: రాబోయే రోజుల్లో బీజేపీ, బీఆర్‌ఎస్‌లకు గుణపాఠం తప్పదని కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మేయర్ ధర్మపురి సంజయ్ అన్నారు. ఆదివారం బీజేపీ నాయకులు చంద్రశేఖర్‌తో పాటు యువకులు ధర్మపురి సంజయ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సంజయ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ రైతు డిక్లరేషన్, యువకుల కోసం యూత్ డిక్లరేషన్ చేసిందన్నారు. బీజేపీ ప్రభుత్వం మీద నమ్మకం లేకపోవడంతో కర్ణాటక ఎన్నికలలో కాంగ్రెస్‌కు పట్టం కట్టినట్లు చెప్పారు. ఇప్పటి వరకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ. లక్ష రుణమాఫీ చేయలేదన్నారు. అలాగే నిరుద్యోగ యువతకు రూ.4 వేలు ఇస్తానని ప్రకటించినా ఇంత వరకు ఇవ్వలేదని ఎద్దేవా చేశారు.

ఇళ్ల స్థలాలు సాధించేందుకు సంఘటితంగా పోరాడాలి

ఖలీల్‌వాడి: ఇళ్ల స్థలాలు ఇచ్చేంత వరకు సంఘటితంగా పోరాడాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేశ్ బాబు అన్నారు. నగరంలోని ఎల్లయ్య చెరువు కట్టపైన ఉన్న మూడున్నర ఎకరాల ప్రభుత్వ భూమిలో నాలుగు రోజుల క్రితం పేదలు గుడిసెలు వేసుకున్నట్లు తెలిపారు. ఇళ్ల స్థలాలు, ఇంటి నిర్మాణం కోసం ప్రభుత్వం నిధులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా ఇళ్ల స్థలాలు కేటాయించకపోవడంతో ప్రభుత్వ భూమిలో నిరుపేదలు గుడిసెలు వేసుకున్నట్లు తెలిపారు. ప్రభుత్వం వీరికి పట్టాలు ఇచ్చి, ఇంటి నిర్మాణానికి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు గోవర్ధన్, నగర నాయకులు సుజాత, తదితరులు పాల్గొన్నారు.

'బీఆర్‌ఎస్ విగ్రహాలతో రాజకీయం చేస్తోంది'



ఖలీల్‌వాడి: ఎన్టీఆర్ విగ్రహాలను పెట్టి బీఆర్‌ఎస్ పార్టీ రాజకీయం చేస్తుందని నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం టీడీపీ అధ్యక్షుడు దేగాం యాదగౌడ్ అన్నారు. ఆదివారం ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాల్లో భాగంగా నగరంలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా దేగాం యాదగౌడ్ మాట్లాడుతూ...ఎన్టీఆర్ పెట్టిన పార్టీలో పదవులు అనుభవించి, పార్టీని కష్టకాలంలో వదిలేసి పోయిన నేతలు ఎన్టీఆర్ వారసులు అంటూ చెప్పడం సరైనది కాదన్నారు.

వీరసావర్కర్ జయంతి



ఆర్మూర్‌టౌన్: బీజేపీ ఆర్మూర్ పట్టణ శాఖ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరయోధుడు వీర సావర్కర్ 140వ జయంతి వేడుకలను ఆర్మూర్ పట్టణంలో ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జీవీ నరసింహారెడ్డి, బీజేపీ పట్టణ అధ్యక్షుడు జెస్సు అనిల్ కుమార్ మాట్లాడుతూ.. వీర సావర్కర్ జయంతి రోజున, ప్రజాస్వామ్య దేవాలయం అయిన నూతన పార్లమెంటు భవనాన్ని గౌరవ భారత ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించడాన్ని హర్షిస్తున్నామని తెలిపారు. నరేంద్ర మోదీని విమర్శించే నైతిక హక్కు ఎవరికీ లేదన్నారు. నాయకులు బొట్ల విజయ్, ద్యాగ ఉదయ్, కర్షన్ మధు, తదితరులు పాల్గొన్నారు.

మండుటెండలో ఉపాధి పనులు

- పని ప్రదేశాల్లో కనీస వసతులు కరువు
- 50శాతం దాటని కూలీల హాజరు శాతం
- అధికారులకు నివేదించినా.. ఫలితం శూన్యం



మంచిప్ప చెరువులో ఉపాధి పనులు చేపడుతున్న కూలీలు

మోపాల్(నిజామాబాద్‌రూరల్): జిల్లావ్యాప్తంగా ఎండలు మండుతున్నాయి. ఉపాధి కూలీలు మండుటెండలోనే పనులు చేపడుతున్నారు. కూలీలకు పని ప్రదేశాల్లో నీడ, నీరు, ఇతర సౌకర్యాలు కల్పించాల్సి ఉన్నా.. ఎక్కడ కూడా కల్పించడంలేదు. తద్వారా కూలీల హాజరు శాతం 50 శాతానికి మించడం లేదు. టెంట్లు, తాగునీటి వసతి, తదితర సౌకర్యాలు కల్పించాలని ఏపీవోలు ఉన్నతాధికారులకు నివేదించినా.. ఫలితం లేకుండా పోయింది. మండలంలో 21 గ్రామపంచాయతీలు ఉన్నాయి. 9,932 జాబ్‌కార్డులు ఉండగా, 4 వేల వరకు మాత్రమే జాబ్‌కార్డులు యాక్టివ్‌గా ఉన్నాయి. పాత గ్రామ పంచాయతీల ఆధారంగా మండలంలో 13 మంది ఫీల్డ్ అసిస్టెంట్లు ఉండాలి. కానీ తాడెం, మోపాల్, సిర్‌పూర్‌లో ఫీల్డ్ అసిస్టెంట్లు లేరు. 10 మంది మాత్రమే ఉన్నారు. ప్రస్తుతం 3,200 మంది వరకు కూలీలు మాత్రమే పనులకు హాజరవుతున్నారు.

మౌలిక సౌకర్యాలు లేవు..

మండలంలో చెరువుల్లో పూడికతీత, ఇతరత్రా ఉపాధి పనులు చేపడుతున్నారు. పని ప్రదేశాల్లో కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించకపోవడంతో పనులకు వచ్చేందుకు భయపడుతున్నారు. అసలే అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. 9 దాటితే సూర్యుడు ప్రతాపం చూపిస్తున్నాడు. ఈ సమయంలో పని ప్రదేశాల్లో కూలీలకు నీడ, తాగునీటి సౌకర్యం కల్పించాలి. కానీ కూలీలు ఎవరికి వారే వాటర్ బాటిళ్లు తెచ్చుకుంటూ, ఎండ నుంచి రక్షణకు చేతి రుమాలీలు, టవళ్లు కట్టుకుంటున్నారు. రవాణా సౌకర్యం అసలే కల్పించడం లేదు. ఎంత దూరమైనా నడిచే వెళ్తున్నారు. మరికొందరు మట్టి తరలించే ట్రాక్టర్లను ఆశ్రయిస్తున్నారు.

సామగ్రి సరఫరా లేదు..

ఉపాధిహామీ పథకం ప్రారంభంలో టెంట్లు, తాగునీరు బాటిళ్లు, పారలు, ఇతరత్ర పరికరాలు సరఫరా చేశారు. కొన్నేళ్ల తర్వాత సరఫరాను నిలిపేశారు. 2009–10 తర్వాత ప్రభుత్వాల నుంచి సామగ్రి సరఫరా కాలేదని కూలీలు వాపోతున్నారు. ఎవరి పనిముట్లు వారే తెచ్చుకుంటున్నారు. ఇదే విషయమై ఏపీవో సునీతను సంప్రదించగా, టెంట్లు, పనిముట్లు కావాలని అధికారులకు నివేదించాం. అక్కడి నుంచి రాగానే కూలీలకు అందజేస్తామని పేర్కొన్నారు.

దశాబ్ది ఉత్సవాల్లో భాగస్వాములు కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

వేల్పూర్: వచ్చే నెల 2 నుంచి నిర్వహించే తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం వేల్పూర్ రైతు వేదికలో నిర్వహించిన బాల్కొండ నియోజకవర్గ స్థాయి అధికారుల సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. 21 రోజుల పాటు జరుపుకునే ఉత్సవాలపై కూలంకషంగా చర్చించారు. రాష్ట్రం సాధించిన తర్వాత కేసీఆర్ ప్రభుత్వం సాధించిన విజయాలు గ్రామ గ్రామాన వివరించాలన్నారు. తెలంగాణ ప్రభుత్వం సాధించిన విజయాలు కచ్చితంగా చెప్పుకోవాలని, మౌనంగా ఉండాల్సిన పనిలేదని స్పష్టం చేశారు. సమావేశంలో రాష్ట్ర ఉమెన్స్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఆకుల లలిత, మాజీ ఎమ్మెల్సీ వీజీ గౌడ్, డీసీవో సింహాచలం, ఏసీపీ ప్రభాకర్, తహసీల్దార్లు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.



ఆవిష్కరిస్తున్న మంత్రి ప్రశాంత్‌రెడ్డి

మానసిక అవగాహన కరపత్రాల ఆవిష్కరణ

నిజామాబాద్‌సిటీ: ఇండియన్ సైకియాట్రిక్ సొసైటీ తెలంగాణ శాఖ ప్రతినిధి డాక్టర్ విశాల్ ఆకుల రూపొందించిన మానసిక అవగాహన కరపత్రాలను ఆదివారం జీజీహెచ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి ప్రశాంత్‌రెడ్డి ఆవిష్కరించారు. ఆదివారం జరిగిన కార్యక్రమంలో అర్బన్ ఎమ్మెల్యే గణేష్ గుప్తా, రాష్ట్ర ఉమెన్స్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఆకుల లలిత, నగర మేయర్ దండు నీతూకిరణ్, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంత్, నిజామాబాద్ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఇందిరా, జీజీహెచ్ సూపరింటెండెంట్ ప్రతిమా రాజ్, పాల్గొన్నారు.

ఎన్‌టీఆర్‌కు ఘన నివాళులు



ధర్మారం(బి) ఎన్‌టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు

సాక్షి నెట్‌వర్క్:మాజీ సీఎం ఎన్‌టీఆర్ శత జయంతిని ఆదివారం అర్బన్, రూరల్ నియోజకవర్గాల పరిధిలో పలుచోట్ల ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉమ్మడి రాష్ట్రానికి ఆయన చేసిన సేవలను నాయకులు కొనియాడారు. పలు చోట్ల పండ్లు పంపిణీ చేశారు. అన్నదానాలు చేశారు. తెలుగు జాతి కీర్తిని ప్రపంచవ్యాప్తంగా ఉన్నత స్థితిలో నిలబెట్టిన మహనీయుడు, యుగపురుషుడు ఎన్‌టీఆర్ అని మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు కొనియాడారు. డిచ్‌పల్లి మండలం ధర్మారం(బి) గ్రామంలో ఎన్‌టీఆర్ జయంతి ఘనంగా నిర్వహించారు.



మోపాల్: పూలమాల వేస్తున్న నాయకులు



నిజామాబాద్ సిటీ: స్థానిక గీతాభవన్‌లో..

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

జక్రాన్‌పల్లి: అర్గుల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివిన 2003–04 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అర్గుల్‌లోని గోర్త యమున ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ఈ సమ్మేళనానికి విద్యాబుద్ధులు నేర్పిన గురువులు రాజేశ్వర్, పురుషోత్తం, సుదర్శన్, రాజేందర్, అహల్య, ఇందిర, రాధాదేవిలు హాజరయ్యారు. గురువులను పూర్వ విద్యార్థులు సత్కరించారు. ఇరవై ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థులు ఒకరినొకరు ఆలింగం చేసుకుని ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఒకరినొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకుని తమ ఆనందాన్ని పంచుకున్నారు.



అర్గుల్‌లో ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న 2003-04 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు

కనకయ్యను బెదిరిస్తే ఊరుకునేది లేదు



సమావేశంలో మాట్లాడుతున్న తెయూ ఎంఎస్‌ఎఫ్ ఉపాధ్యక్షుడు వెంకట రమణ

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కనకయ్యను బెదిరింపులకు గురి చేస్తే ఊరుకునేది లేదని, పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని తెయూ ఎంఎస్‌ఎఫ్ ఉపాధ్యక్షుడు బొల్లారపు వెంకటరమణ మాదిగ హెచ్చరించారు. ఆదివారం తెయూ క్యాంపస్‌లో వెంకటరమణ మాట్లాడారు. వర్సిటీలో కొందరు కుల రాజకీయాలకు పాల్పడుతున్నారని, వర్సిటీ అభివృద్ధికి ఇది ఎంతమాత్రం మంచిది కాదన్నారు. 2021లో సుమారు రెండు నెలలు ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా కనకయ్య పని చేశారని, అనంతరం ఈసీ ఆయనను తొలగించి ప్రొఫెసర్ యాదగిరిని నియమించిందన్నారు. తర్వాత యాదగిరి స్థానంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా వచ్చిన ప్రొఫెసర్ శివశంకర్ పని చేసినంతకాలం ఈసీ సభ్యులకు ఈసీ సమావేశాలు ఎందుకు గుర్తు రాలేదని ప్రశ్నించారు. దళితురాలైన విద్యావర్ధిని నియమిస్తే ఎలాంటి విచారణ లేకుండానే ఆమెను సస్పెండ్ చేయాలని ఈసీ ఎలా తీర్మానిస్తుందని ప్రశ్నించారు. తెయూ ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా యాదగిరికి ఈసీ సభ్యులు మద్దతు తెలుపడం వెనుక అసలు రహస్యాలు వేరే ఉన్నాయని వాటిని త్వరలో బయటపెడతామని హెచ్చరించారు. సమావేశంలో ఎంఎస్‌ఎఫ్ కార్యదర్శి ఆడెపు అభినయ్ మాదిగ, ఉదయ్ మాదిగ పాల్గొన్నారు.

'డబుల్'పై చిత్తశుద్ధిలేని ప్రభుత్వం

– కాంగ్రెస్ నేతలు భూపతి రెడ్డి, నగేశ్ రెడ్డి



నడిపల్లిలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ భూపతిరెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నగేష్‌రెడ్డి

డిచ్‌పల్లి: డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణంలో ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి లేదని కాంగ్రెస్ రూరల్ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్సీ భూపతిరెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కాటిపల్లి నగేశ్‌రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే అర్హులైన నిరుపేదలందరికీ ఇళ్లు నిర్మించి ఇస్తామని వారు పేర్కొన్నారు. ఆదివారం నడిపల్లిలో ఏడు సంవత్సరాల క్రితం పిల్లర్ల వరకు నిర్మించి వదిలేసిన డబుల్ బెడ్ రూం ఇళ్లను కాంగ్రెస్ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా భూపతిరెడ్డి, నగేష్‌రెడ్డిలు మాట్లాడుతూ.. తమ పార్టీ అధికారంలోకి రాగానే పేదల సొంతింటి కలను సాకారం చేస్తామన్నారు. ప్రభుత్వం ఇచ్చే రూ.3 లక్షలు కూలీలకే సరిపోతాయని ఇళ్లు నిర్మాణం ఎలా పూర్తవుతుందని ప్రశ్నించారు. ఇప్పటికీ అన్ని గ్రామాల్లో కాంగ్రెస్ హయాంలో నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లే కనిపిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ కిసాన్‌కేత్ జిల్లా అధ్యక్షుడు ముప్ప గంగారెడ్డి, టీపీసీసీ డెలిగేట్ శేఖర్‌గౌడ్, డిచ్‌పల్లి మండల అధ్యక్షుడు అమృతాపూర్ గంగాధర్, డీసీసీ కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తీరనున్న ఇక్కట్లు

- ఇందల్వాయి–ధర్పల్లి రోడ్డు పనులు ప్రారంభం



కొనసాగుతున్న రోడ్డు పనులు

ఇందల్వాయి: రూరల్ నియోజకవర్గంలో 44వ నంబరు జాతీయ రహదారి నుంచి మూడు మండల కేంద్రాలను కలుపుతూ ఉన్న ఇందల్వాయి – ధర్పల్లి– సిరికొండ ప్రధాన రహదారి సమస్యలు తీరనున్నాయి. ఇంతకాలం గుంతలు, కోతకు గురైన అంచులతో తరుచూ ప్రమాదాలకు నిలయంగా మారిన ఈ రోడ్డు బాగుకు రూ.7.20 కోట్లు మంజూరయ్యాయి. దీంతో పనులు కొనసాగుతున్నాయి.

రెండు దశల్లో పనులు

ఇరుకుగా ఉన్న ఇందల్వాయి– ధర్పల్లి రోడ్డును 2009లో వెడల్పు చేశారు. 14 ఏళ్లుగా సరైన మరమ్మతులకు నోచుకోక రోడ్డు గుంతలమయంగా మారింది. దీంతో తరుచూ ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. ఎట్టకేలకు ప్రభుత్వం నిధులు విడుదల చేయడంతో రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి. ఈ పనులను రెండు దశల్లో చేపట్టనున్నారు. ఇందల్వాయి నుంచి ధర్పల్లి మీదుగా సిరికొండ మండలం వాల్గొట్ వరకు రోడ్డును బాగు చేస్తున్నారు. ఇందల్వాయి నుంచి అన్సాన్‌పల్లి వరకు 8.5 కిలో మీటర్ల రోడ్డును వేయడంతో పాటు ధర్పల్లి నుంచి వాల్గొట్ వరకు రోడ్డుకు మరమ్మతులు చేపట్టనున్నారు. ఈ మార్గంలో తిర్మన్‌పల్లి, లింగాపూర్ వాగులపై రెండు లో లెవెల్ వంతెనలు ఉన్నాయి. వర్షాలు అధికంగా కురిసినప్పుడు వంతెనలపై నుంచి వరద నీరు పారి వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతుంది. దీన్ని దృష్టిలో ఉంచుకొని రోడ్డుతో పాటు హైలెవెల్ వంతెనలు నిర్మించాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

వంతెనలు నిర్మించాలి

గుంతలమయంగా ఉన్న రోడ్డుపై ప్రయాణం అసౌకర్యంగా ఉండేది. రోడ్డు పనులు పూర్తయితే వాహనదారుల కష్టాలు తీరుతాయి. అలాగే తిర్మన్‌పల్లి, లింగాపూర్ వాగులపై హై లెవెల్ వంతెనలకు కూడా ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే బాగుంటుంది. – శ్రీకాంత్‌రెడ్డి, నల్లవెల్లి

నివేదిక అందజేశాం

రోడ్డు పనులను వీలైనంత త్వరగా పూర్తి చేసేందుకు యత్నిస్తున్నాం. వర్షాలు తొందరగా కురిస్తే కొంచెం ఆలస్యమయ్యే అవకాశం ఉంది. లింగాపూర్, తిర్మన్‌పల్లి వాగులపై హై లెవెల్ వంతెనల నిర్మాణానికి నివేదికలు పంపించాం. – మనోహర్, ఏఈ, ఆర్‌అండ్‌బీ, ఇందల్వాయి

సమాచారం..

నేడు కాగడాల ర్యాలీ

నిజామాబాద్ సిటీ: శంభుని గుడి ఆవరణలో ఆక్రమణలు మొత్తం తొలగించేదాకా, కంఠేశ్వర్ ఆలయ స్థలంలో నిర్మించిన అక్రమ నిర్మాణాలను కూల్చేదాక కాగడాల ర్యాలీ నిర్వహించాలని హిందూ దేవాలయ పరిరక్షణ సమితి(ఇందూర్) పిలుపునిచ్చింది. నేడు(సోమవారం) సాయంత్రం 6:30 గంటలకు దేవాలయ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో గోల్ హనుమా చౌరస్తా జెండా బాలాజీ మందిరం వద్ద ర్యాలీ ప్రారంభమై శివాజీ నగర్ ఉషా మల్టీప్లెక్స్ శివాజీ చౌక్ వరకు జరగబోయే ర్యాలీలో హిందువులందరూ పాల్గొనాలని సమితి నేతలు కోరారు.

మిత్రుడికి చేయూత

కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలోని లాండేరి రాజేందర్‌కు 1995–96 ఎస్‌ఎస్‌సీ బ్యాచ్ విద్యార్థులు ఆర్థిక చేయూత అందించారు. రాజేందర్ కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో క్లాస్‌మేట్స్ అందరు కలిసి రూ.27 వేలు పోగేశారు. ఆదివారం రాజేందర్ ఇంటికి వెళ్లి ఆర్థిక సహాయం అందజేశారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	62,200	వెండి (కిలో)	74,800
22 క్యారెట్స్	57,350	– నిజామాబాద్ బిజినెస్	

కూరగాయల ధరలు (రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	6	12	క్యాప్సికం	50	70
బెండకాయ	20	40	గాజరుగడ్డ	35	50
బీరకాయ	30	50	పచ్చిమిర్చి	40	60
దొండకాయ	10	20	దోసకాయ	15	30
బీర్నిసుకాయ	80	100	ఆలుగడ్డ	15	30
కాకరకాయ	35	50	గోబిగడ్డ	10	20
వంకాయ	30	50	గోబిపువ్వు	25	50
పాలకూర	40	60	బీట్‌రూట్	25	50
మెంతికూర	50	70	గోరు చిక్కుడు	40	60
కొత్తిమీర	40	60	చిక్కుడుకాయ	40	60
పుదీనా	30	50			

– ఇందూరు

మాంసం ధరలు (రూ.)

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	220
		లైవ్	180
స్కిన్‌లెస్	260	మటన్	750

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లీష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	మేమ్ ఫేమస్ 10.30, 01.25 2018(తెలుగు) - 4.20, 10.20 బిచ్చగాడు-2 - 07.25
స్క్రీన్-2	2018(తెలుగు) -01.30,07.30 ది కేరళ స్టోరీ (తెలుగు) మేమ్ ఫేమస్ 10.30
స్క్రీన్-3	2018(తెలుగు) 10.30 కేరళ స్టోరీ(తెలుగు)-01.35 మేమ్ ఫేమస్ 04.30, 07.20 ఫాస్ట్ ఎక్స్ (తెలుగు- 3డీ) 10.25

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	ఫాస్ట్ ఎక్స్ (ఇంగ్లీష్- 3డీ) 10.30,7.10 2018(తెలుగు) 01.00,10.05 ఫాస్ట్ ఎక్స్ (తెలుగు- 3డీ) 04.10
స్క్రీన్-2	ది లిటిల్ మెర్మైడ్ (ఇంగ్లీష్-3డీ)- 10.25, 07.35 ది కేరళ స్టోరీ (తెలుగు) 01.20-బిచ్చగాడు2 4.20 ఫాస్ట్ ఎక్స్ (తెలుగు- 3డీ) 10.30
స్క్రీన్-3	జేత్ర 11.05 మళ్లీ పెళ్లి 01.40,07.40 మేమ్ ఫేమస్ 04.30,10.30
స్క్రీన్-4	ది కేరళ స్టోరీ (తెలుగు) 10.35, మెంటో(తెలుగు) 01.35,10.00 గ్రే ది స్పై హూ(తెలుగు) 04.10 2018(తెలుగు) 06.50
దేవి	బిచ్చగాడు2
నటరాజ్	మళ్లీ పెళ్లి
లలితామహల్	మేమ్ ఫేమస్
విజయ్	2018(తెలుగు)

ఆధ్యాత్మికం

ఘనంగా పోచమ్మ పండుగ



సిరికొండ: మండల కేంద్రంతో పాటు హుస్సేన్‌నగర్, న్యావనంది తదితర గ్రామాల్లో పోచమ్మ పండుగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. వర్షాలు బాగా కురిసి పంటలు సమృద్ధిగా పండాలని పోచమ్మ గద్దెల వద్ద పూజలు చేశారు. కుల సంఘాల వారీగా బోనాలు తీసి అమ్మవారికి సమర్పించారు. మొక్కులు తీర్చుకున్నారు. అంతా బాగుండాలని వేడుకున్నారు.

ఇందల్వాయిలో..

ఇందల్వాయి: మండలంలోని గన్నారం, మల్లాపూర్, నల్లవెల్లి, చంద్రాయన్‌పల్లి గ్రామాల్లో అభివృద్ధి కమిటీల ఆధ్వర్యంలో పోచమ్మ పండగను ప్రజలు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. గ్రామ దేవతలకు అభిషేకాలు, పూజలు నిర్వహించి బోనాలను ఊరేగించారు.

ఘనంగా పోచమ్మ తల్లికి బోనాలు



ధర్పల్లి: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లోని ప్రజలు ఆదివారం పోచమ్మ తల్లికి బోనాలు సమర్పించి పండగను ఘనంగా జరుపుకున్నారు. శివ సత్తుల పూనకాలు, పోతరాజుల విన్యాసాలతో మహిళలు బోనాలతో ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి చేరుకొని ప్రదక్షిణలు చేసి ఒడి బియ్యంతో పాటు నైవేద్యాన్ని సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

గ్రామ దేవతలకు జలాభిషేకం



జక్రాన్‌పల్లి: పడకల్‌లో ఆదివారం గ్రామ దేవతలకు జలాభిషేకం నిర్వహించారు. గోదావరిలోని గంగ నీటిని తీసుకువచ్చి గ్రామంలో ఊరేగించారు. అనంతరం వివిధ గ్రామ దేవతలకు జలాభిషేకం చేశారు. డప్పు మేళాలతో గంగనీటిని గ్రామ ప్రధాన వీధుల గుండా ఊరేగించారు. ముందుగా గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గంగ నీళ్లతో గ్రామ దేవతలకు జలాభిషేకం చేశారు. అనంతరం వివిధ కుల సంఘాల సభ్యులు వెళ్లి గ్రామ దేవతలకు జలాభిషేకం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సర్పంచ్ పుప్పాల శ్రీనివాస్, ఉప సర్పంచ్ రిత్విక్, ఎంపీటీసీ గంగారెడ్డి, వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.